ఏవోబీలో చిత్రీకరణ సందడి


జాన్ విజయ్‌తో అభిమానులు

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: మాచ్‌ఖండ్ పరిసరాల్లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ప్రముఖ దర్శకుడు జాగర్లమూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో, అనుష్కశెట్టి ముఖ్య కథానాయికగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఏవోబీలోని ఒనకఢిల్లీ, మాచ్‌ఖండ్, లమతపుట్టు ప్రాంతాల్లో పలు సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. శనివారం డుడుమ జలాశయం, ఒనకఢిల్లీ వ్యూపాయింట్ల షూటింగ్ జరిగింది. ప్రముఖ నటులు జగపతి బాబు, జాన్‌విజయ్‌లతో సన్నివేశాలు చిత్రీకరించారు. దీన్ని తిలకించేందుకు స్థానికులు తరలివస్తున్నారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రం, వించ్‌లలో షూటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.

డీఎఫ్‌వోల నియామకం

పాడేరు, రంపచోడవరం, న్యూస్‌టుడే: పాడేరు, రంపచోడవరం డీఎఫ్‌ఓలుగా పి.వి.సందీప్‌రెడ్డి, రవీంద్ర దామ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. సందీప్‌రెడ్డి కడపలో పనిచేస్తూ బదిలీపై పాడేరు వస్తున్నారు. పాడేరు డీఎఫ్‌ఓగా పనిచేసిన వినోద్‌కుమార్ సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. రంపచోడవరంలో పనిచేసిన డీఎఫ్‌వో నరేంద్రియన్ స్థానంలో ఏలూరు జిల్లా డీఎఫ్‌వోగా పనిచేస్తున్న 2017 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్‌కు చెందిన రవీంద్ర దామ వస్తున్నారు.

గొంతు తడిసే రోజులొస్తున్నాయి!

✦ పాడేరు పట్టణంలో ఇంటింటికీ కుళాయిలు సిద్ధం!

✦ 'ఈనాడు' కథనంతో రక్షిత పథకాలకు మరమ్మతులు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం పాడేరు పట్టణవాసుల తాగునీటి ఇక్కట్లు త్వరలో తీరనున్నాయి. పట్టణ పరిధిలో రూ.కోట్లు ఖర్చు చేసి గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన రక్షిత పథకాలపై పర్యవేక్షణ లేమితో అవి మరమ్మతులకు గురయ్యాయి. ఫలితంగా జిల్లా కేంద్రంలో నివాసముంటున్న ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆగస్టు 30వ తేదీన 'కోట్లు వెచ్చించినా గొంతు తడవదే' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న 450 ఇళ్లను గుర్తించి జల్‌జీవన్ మిషన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. దసరా నాటికి పనులు పూర్తి చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. పట్టణంలోని లోచలిపుట్టు, గుడివాడలోని తాగునీటి పథకాలకు మరమ్మతులు చేశారు.


ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద సిద్ధం చేసిన రక్షిత నీటి నిల్వ కేంద్రం

వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో.. జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో సుమారు 20 వేలకు పైగా జనాభా నివాసం ఉంటున్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.కోటి ఖర్చుతో పాడేరుకు పది కిలోమీటర్ల దూరంలోని జి.ముంచంగిపుట్టు సమీపంలో మత్స్యగెడ్డ నీటిని శుద్ధి చేసే పరికరాలు అమర్చారు. పైపులను ఏర్పాటు చేసి పాడేరులో నిర్మించిన రక్షిత పథకానికి నీటిని తరలించి అక్కడ నుంచి వీధి కుళాయిలకు నీరందించేవారు. పట్టణంలో జనాభా పెరగడంతో ఈ పథకం సరిపడక దీనికి కొనసాగింపుగా 2014లో తెదేపా ప్రభుత్వం రూ.2.5 కోట్లతో మరో రక్షిత పథకాన్ని నిర్మించింది. 2019 వరకూ అరకొరగా పట్టణవాసులకు నీరందేది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం తాగు నీటి ప్రాజెక్టుల పర్యవేక్షణను విస్మరించింది. జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరైన కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం పక్కదారి పట్టించి నీటి కష్టాలను మరింత పెంచింది. నిధుల లేమితో రెండు రక్షిత పథకాలపై పర్యవేక్షణ కొరవడింది. ఈ సమస్యపై 'ఈనాడు'లో వచ్చిన కథనానికి కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవోలు స్పందించి ఇంటింటికీ కుళాయిలు తక్షణమే ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

పట్టణ ముఖచిత్రం ఇలా...

జనాభా: సుమారు 20 వేలు	
ప్రధాన వీధులు: లోచలిపుట్టు, సుంద్రుపుట్టు, గుడివాడ, సినిమా హాల్ సెంటర్, పాతబస్టాండ్, మసీద్ సెంటర్, గడ్డి కాలనీ	
అందుబాటులో ఉన్న నీటి పథకాలు: రెండు (లోచలిపుట్టు, సుంద్రుపుట్టు వద్ద)	
వీధి కుళాయిలు: సుమారు 50	
తొలిదశలో ప్రతిపాదించిన ఇంటింటి కుళాయిలు: 450	
జల్‌జీవన్ మిషన్ నిధుల కేటాయింపు: సుమారు రూ.42 లక్షలు	

భవిష్యత్తులో అందరికీ..

పాడేరులో పట్టణంలో భవిష్యత్తులో అందరికీ జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగు నీరందించేలా చర్యలు తీసుకుంటున్నాం. తొలి దశలో 450 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే దృఢ సంకల్పంతో కలెక్టర్, పీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు ఉన్నారు. ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన అంచనాలు రూపొందిస్తున్నాం.

– ప్రకాశ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ


రూ.కోట్లు వెచ్చించినా గొంతు తడవదే!

ఆగస్టు 30న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

మొదటి దశలో 450 కుళాయిలు

పట్టణంలోని లోచలిపుట్టు, సుంద్రుపుట్టు, సినిమాహాల్ కేంద్రం, రేకుల కాలనీ, పాత బస్టాండ్, మసీదు సెంటర్, గుడివాడ ప్రాంతాల్లో 450 కుళాయిలకు జల్‌జీవన్ మిషన్ తొలి దశలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేలా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఒక్కో మనిషి రోజుకు 55 లీటర్ల వరకూ నీరు వినియోగిస్తారని ప్రాథమిక అంచనా వేశారు. దీని కోసం రూ.42 లక్షలు నిధులు సైతం మంజూరు చేశారు. అందుబాటులో ఉన్న రెండు రక్షిత పథకాల్లో నిల్వ ఉన్న నీరు ద్వారా కొన్ని ఇళ్లకు అందిస్తారు. అదనపు బోర్లు ఏర్పాటు చేసి 40 నుంచి 50 ఇళ్లకు తాగునీరందేలా చర్యలు తీసుకుంటున్నారు.

బంగారు వర్ణంలో సీతాకోకచిలుక



మన్యంలో సీతాకోక చిలుకలు రకరకాల రంగులతో కనిపిస్తుంటాయి. రాజవొమ్మంగిలో శనివారం ఓ ఇంటి వద్ద సీతాకోకచిలుక వాలింది. బంగారు వర్ణంలో ఎంతో అందంగా ఉంది. రెక్కలపై పలుచటి గీతల మాదిరిగా ఉండటంతోపాటు మధ్యలో కాషాయం రంగులో ఉంది. రెక్కల అంచున నల్లటి, తెల్లటి గీతలు ఉండటంతో ఆసక్తిగా చూశారు.

–న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

అన్ని రంగాల్లో రాణిస్తే గుర్తింపు

ముగిసిన ఏకలవ్య పాఠశాలల సాంస్కృతిక ఉత్సవం



అరకులోయ, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించి గుర్తింపు పొందాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆకాంక్షించారు. ఎండపల్లివలస ఏకలవ్య పాఠశాలలో జరిగిన ఐదో ఏకలవ్య పాఠశాలల రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవం శనివారంతో ముగిసింది. చివరిరోజు కార్యక్రమంలో పీవో అభిషేక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే రెండేళ్లలో ఏకలవ్య పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు సమకూరుతాయని చెప్పారు. గిరిజన విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు గీసిన బొమ్మలు, నృత్య ప్రదర్శనలు తిలకించారు. ఫెస్ట్ కన్వీనర్ భాస్కర రావు, గురుకులాల కన్వీనర్ పీఎస్ఎన్ మూర్తి, గురుకులాల డిప్యూటీ కార్యదర్శి రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైంది.


విద్యార్థులతో ఐటీడీఏ పీవో అభిషేక్

ఫెస్ట్ విజేతలు వీరే...

విభాగం	విజేత	రన్నరప్
గ్రూప్‌సాంగ్	కొయ్యూరు	అడ్డతీగల
ట్రైబల్ గ్రూప్ సాంగ్	అరకులోయ	భామిని
సోలో సాంగ్	చింతపల్లి	డుంబ్రిగుడ
ట్రైబల్ పెయింటింగ్	జశ్వంత్ (బుట్టాయగూడెం)	హరిత (పాడేరు)
ట్రైబల్ ఇన్‌స్ట్రుమెంట్	అనంతగిరి	పెదబయలు

నేడు మంత్రి దుర్గేశ్ పర్యటన

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యటక కేంద్రాలు తైడా జంగిల్‌బెల్స్, బొర్రాగుహల్లో పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆదివారం పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు.

హత్యకేసు గుట్టువిప్పిన విజిటింగ్ కార్డు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి మండలం పెదబరడ పంచాయతీ చింతలూరు గ్రామ సమీపంలోని టేకుతోటలో గత నెల 27న గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఈ కేసును చింతపల్లి ఎస్సై అరుణ్‌కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించి సీఐ రమేష్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రాజమహేంద్రవరానికి చెందిన దొడ్డి రాజా అర్జున్ (50) వడ్రంగి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు మద్యానికి బానిస కావడంతో 20 ఏళ్ల క్రితం భార్య, పిల్లలు ఈయన్ను వదిలేసి హైదరాబాద్ వెళ్లి జీవిస్తున్నారు. రాజా అర్జున్ రాజమహేంద్రవరంలో సోదరి వద్ద ఉంటున్నారు. ఇతడు స్నేహితులు వెంకటేష్, పుష్పరాజ్‌లతో కలసి రోజూ మద్యం తాగుతుండేవాడు. వీరంతా వడ్రంగి పని నిమిత్తం మన్యం ప్రాంతానికి వెళ్లాలని నిర్ణయించి రాజమహేంద్రవరానికి చెందిన ఇంటీరియర్ డెకరేషన్ షాపు యజమాని వద్ద విజిటింగ్ కార్డులు తీసుకున్నారు. గత నెల 27న చింతపల్లి మండలం లోతుగెడ్డ కూడలికి ముగ్గురూ చేరుకున్నారు. మద్యం మత్తులో వీరి మధ్య తగాదా నెలకొంది. ఈ నేపథ్యంలో రాజా అర్జున్‌ను హతమార్చాలని పుష్పరాజ్, వెంకటేష్‌లు భావించారు. లోతుగెడ్డ కూడలిలో నాటు సారా కొనుగోలు చేసి సమీపంలోని టేకు తోటల్లోకి వెళ్లారు. రాజా అర్జున్‌తో ఎక్కువగా సారా తాగించారు. మద్యం మత్తులోనున్న అతడి తలపై రాయితో కొట్టి చంపేసి ఏమీ తెలియనట్టు వెళ్లిపోయారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు సంఘటనాస్థలం వద్ద విజిటింగ్ కార్డు లభించింది. దీని ఆధారంగా రాజమహేంద్రవరం వెళ్లి విచారించారు. స్నేహితులే చంపేశారని గుర్తించి, డౌనూరు వద్ద మద్యం తాగుతుండగా వారిద్దరినీ చాకచాక్యంగా పట్టుకున్నారు.

అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలి

రంపచోడవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రజలందరికీ దుర్గమ్మ తల్లి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆకాంక్షించారు. స్థానిక మార్కెట్‌వీధి సమీపాన నూతనంగా నిర్మించిన దేవీ ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేతోపాటు ఆమె భర్త మఠం విజయభాస్కర్ చేతులమీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు అడబాల బాపిరాజు, అనంతమోహన్, బాపిరాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు సూరిబాబు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


దేవీ ఆలయంలో ఎమ్మెల్యే శిరీషాదేవి, విజయభాస్కర్ దంపతుల పూజలు

పాపికొండల పర్యటక బోట్లు తనిఖీ

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ ఆలయం నుంచి పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యాటక బోట్లను రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ శనివారం తనిఖీ చేశారు. తొలుత సిరివెన్నెల బోటను పరిశీలించిన ఆమె దస్త్రాలు పరిశీలించారు. బోటులో ఎంత మంది విహారయాత్రకు వెళ్తారు, వారు ధరించే లైఫ్ జాకెట్లు, బోటులో తీసుకుంటున్న జాగ్రత్తలపై నిర్వాహకులను ఆరా తీశారు. జల వనరుల శాఖ అధికారులు గోదావరిలో వరద పరిస్థితి, విహారయాత్రకు వెళ్లే సమయంలో నీటి మట్టం, రూట్ అనుమతుల వివరాలను ఆమెకు వివరించారు. అనంతరం గోదావరి నదిపై బోటులో పూడిపల్లి మీదుగా దేవీపట్నం వరకు సబ్ కలెక్టర్ పర్యటించారు. గతేడాది పాపికొండల విహారయాత్రకు వెళ్లిన వారి వివరాలను పర్యాటక శాఖ అధికారులు ఆమెకు వివరించారు. పోశమ్మగండి వద్ద ఉన్న కంట్రోల్ రూం పరిస్థితిపై సబ్ కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.


బోటు నిర్వాహకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు కాపు/ తెలగ అవివాహిత వధూవరులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి కాపు/తెలగ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం అక్కయ్య పాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలో ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (ఆదివారం, అక్టోబరు 6న)** ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు **91549 18858, 80080 01686** ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను ఇక్కడ తెలిపిన వాట్సాప్ నెంబర్లకు పంపవచ్చు. **- న్యూస్‌టుడే, విశాఖపట్నం**

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఏవోబీలో ఉద్రిక్తత

సీలేరు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఎన్‌కౌంటర్‌లో సుమారు 31 మంది మావోయిస్టులు మృతిచెందగా.. మరికొంతమంది కీలక నేతలు తప్పించుకున్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో ఏవోబీలో పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసు బలగాలను సరిహద్దు కూడలిలో ఉంచారు. ఒడిశా సరిహద్దు కూడలిలో సీలేరు ఎస్సై జె.రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు ఏరియా డామినేషన్ నిర్వహించారు. ఆంధ్రా నుంచి ఒడిశా వెళ్లే రహదారుల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు.


సరిహద్దు కూడలిలో తనిఖీలు చేస్తున్న ఎస్సై రామకృష్ణ, సిబ్బంది

30 కేజీల గంజాయి పట్టివేత

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెం పోలీసులు శుక్రవారం రాత్రి గొడ్లగూడెం కూడలి వద్ద రూ.లక్షన్నర విలువైన 30 కేజీల గంజాయి పట్టుకున్నారు. ఎస్సై కె.శివనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గొడ్లగూడెం కూడలి నుంచి గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీరాజ్ క్యాంపునకు చెందిన పాంగి చింటు, మండి ఈశ్వరరావు, తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక గ్రామానికి చెందిన నల్ల శ్రీకాంత్, మహబూబాబాద్ జిల్లా కందికొండ గ్రామానికి చెందిన బానోతు దిలీప్, ఇస్లావత్ ఆనంద్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రంపచోడవరం కోర్టులో హాజరుపరిచారు.


గంజాయి, నిందితులతో పోలీసులు

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభ

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గుమ్మకోట గ్రామ సచివాలయంలో సర్పంచి పాగి అప్పారావు ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ.. జాబ్‌కార్డుదారులందరికీ వంద రోజుల పని కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకం ఏపీవో సన్యాసినాయుడు మాట్లాడుతూ.. 2025-2026 సంవత్సరంలో చేపట్టబోయే పనుల గుర్తింపునకు గ్రామసభ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన అనంతగిరి ఎస్సై శ్రీనివాసరావును సర్పంచి, ఎంపీటీసీ సభ్యుడు తవిటినాయుడు చేతులమీదుగా సత్కరించారు. గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, టీఏ కొండలరావు, లక్ష్మణరావు, భాస్కరరావు, హైమ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్సై శ్రీనివాసరావును సత్కరిస్తున్న సర్పంచి తదితరులు

బల్క్‌డ్రగ్ పార్క్‌లో మౌలిక సదుపాయాల కల్పన..

పరిశ్రమల రాకే ఆలస్యం!

★ వ్యర్థ రసాయనాల శుద్ధికి 244 కోట్లు

★ నక్కపల్లిలో భారీ సీఈటీ ప్లాంట్ ఏర్పాటు

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, అచ్యుతాపురం

నక్కపల్లిలో ప్రతిష్ఠాత్మక బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వ చొరవతో అధికారులు ఓవైపు భూసేకరణకు సంబంధించి మిగిలిపోయిన సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక గ్రీవెన్స్‌లు నిర్వహిస్తున్నారు. మరోవైపు పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాల కల్పనపైనా దృష్టిసారించారు.

రెండు వేల ఎకరాల్లో ఫార్మాస్యుటికల్ కంపెనీలు నెలకొల్పడానికి అనువుగా రూ.546 కోట్లతో అభివృద్ధి పనులకు ఇటీవల చర్యలు తీసుకున్నారు. తాజాగా ఫార్మా, పెట్రోకెమికల్స్ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలను స్థానికంగా శుద్ధి చేసేందుకు రూ.244 కోట్లతో కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ) ఏర్పాటు చేయడానికి టెండర్లు పిలిచారు. అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న ప్లాంట్ కంటే నాలుగు రెట్లు ఎక్కువ సామర్థ్యంతో ఇక్కడ నిర్మించబోతున్నారు.


పరిశ్రమల కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములు

సమస్య తలెత్తకుండా..

పారిశ్రామికవాడల్లో వ్యర్థాల నిర్వహణ చాలా కీలకం. పెట్టుబడులు పెట్టడానికి వచ్చే కంపెనీలు తమ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులకు అనువైన రవాణా మార్గంతో పాటు, వ్యర్థాలను నిర్వహించే వ్యవస్థ అందుబాటులో ఉందో, లేదో చూస్తారు. పెద్ద కంపెనీలు సొంతంగా వ్యర్థాలను నిర్వహించుకునే వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటున్నాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు అంత భారం భరించలేవు. అందుకే కంపెనీలన్నింటికీ కలిపి వ్యర్థాల నిర్వహణకు సీఈటీపీ ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. పరవాడలోని ఫార్మాసిటీలో సీఈటీపీ ప్లాంట్‌ను రాంకీ ఫార్మా సంస్థ నిర్వహిస్తోంది. అచ్యుతాపురం సెజ్‌లో ఏపీఐఐసీ ద్వారా 1.5 మిలియన్ లీటర్ పర్ డే (ఎంఎల్‌డీ) సామర్థ్యంతో సీఈటీ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. దీని సామర్థ్యం చాలకపోవడంతో అక్కడి రసాయనాలను పరవాడ ఫార్మాసిటీకి తరలించాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో వ్యర్థాలను ఎవరూ లేనిచోట బయటే విడిచిపెట్టేస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరం. అలాంటి పరిస్థితి రాకుండా నక్కపల్లిలో ముందుగానే 6 ఎంఎల్‌డీ సామర్థ్యంతో రసాయన శుద్ధి యూనిట్‌ను నెలకొల్పబోతున్నారు.


అచ్యుతాపురం సెజ్‌లోని 1.5 ఎంఎల్‌డీ సీఈటీపీ ప్లాంట్

నక్కపల్లిలో ఇప్పటికే హెటిరో డ్రగ్స్ మందుల తయారీ పరిశ్రమ ఉంది. దీనికి అదనంగా ఇప్పుడు బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు కాబోతోంది. ఇదివరకే ఏపీఐఐసీ ద్వారా రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, వేంపాడు, డీఎల్‌పురం గ్రామాల పరిధిలో 4200 ఎకరాలు సేకరించారు. అందులో 2 వేల ఎకరాలను బల్క్‌డ్రగ్ పార్క్ కోసం వినియోగించనున్నారు. దీనికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఆర్థిక సాయం చేస్తుంది. ఔషధ తయారీలో స్వయం సంవృద్ధి సాధించేందుకు ఈ భారీ పార్కులు తోడ్పడనున్నాయి. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌లో వంద నుంచి 150 ఫార్మా పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు రూ.14 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. వీటి నుంచి ప్రత్యక్షంగా 30 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సీఈటీపీ, మెరైన్ అవుట్‌ఫాల్‌పై ఖర్చు ఇలా..

- బల్క్‌డ్రగ్ పార్క్‌లో 6 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన సీఈటీపీ ప్లాంట్‌కు రూ.213.13 కోట్లు ఖర్చుచేయనున్నారు.
- శుద్ధిచేసిన 5.7 ఎంఎల్‌డీ రసాయన నీటిని సముద్రంలోకి విడిచిపెట్టే పైప్‌లైన్, ఇతర పనుల కోసం రూ. 22.18 కోట్లు వ్యయమవుతుంది.
- నిర్మించిన ప్లాంట్, పైపులైన్ మూడు నెలల పాటు ట్రయల్ రన్‌కు రూ.2.98 కోట్లు ఇవ్వనున్నారు.
- ప్లాంట్ వినియోగంలోకి వచ్చిన ఆరు నెలల పాటు నిర్వహణకు రూ.5.96 కోట్లు వెచ్చిస్తారు.

అభ్యంతరాలు తెలియజేయండి

పాడేరు, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం పరిధిలో మిషన్ శక్తి పథకం, వన్ స్టాప్ కేంద్రంలో మంజూరైన పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి ఆధారాలతో తీసుకురావాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి ఎన్.సూర్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల్లో అర్హులు, అనర్హుల జాబితాలను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పాడేరులోని తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించాలని వినతి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించాలని మంత్రి లోకేశ్‌ను తెలుగునాడు విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన అమరావతిలో కలిసి మన్యంలో సమస్యలను వివరించారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో డీఎస్సీ, ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు స్టడీ సెంటర్ ఏర్పాటు చేయడంతోపాటు ఉచిత మెటీరియల్ ఇప్పించాలని కోరారు. ఐటీడీఏలో నెలకొన్న నిర్లక్ష్యంపై చర్యలు చేపట్టాలని, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామాల్లో సిమెంటు రహదారులు, వంతెనలు నిర్మించాలని విన్నవించారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లిస్తున్నారని, దీనిపై దర్యాప్తు జరపాలని ఆయన కోరారు.


మంత్రి లోకేశ్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

పాడేరు, న్యూస్‌టుడే: ప్రేమించాడు.. సర్వం నీవే నన్నాడు.. అపురూపంగా చూసుకుంటానన్నాడు.. పెద్దలను ఎదిరించి పెళ్లిచేసుకున్నాడు. మద్యానికి బానిసై అనుమానం పెంచుకున్నాడు. నిత్యం వేధించాడు. ప్రాణంగా ప్రేమించిన భర్తే ఇలా చేయడాన్ని ఆమె తట్టుకోలేకపోయింది. చివరకు ఆత్మహత్యకు పాల్పడింది. పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీ బంగారుమెట్ట పంచాయతీ బి.కొత్తూరు గ్రామానికి చెందిన బడ్నాయిని కృష్ణకుమారి(29), బి.బాలేశ్వరరావు 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్నాళ్లుగా ఆమెను భర్త వేధిస్తుండటంతో శుక్రవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగింది. ఇంట్లో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా గమనించిన భర్త పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆమె మృతి చెందింది. తన కుమార్తెను భర్త వేధించి, చిత్రహింసలకు గురి చేశాడని తండ్రి బాలకృష్ణ పాడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యనారాయణ తెలిపారు. కృష్ణకుమారికి నాలుగు నెలల బాబు ఉన్నాడు. భర్త పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.


కృష్ణకుమారి (పాత చిత్రం)

ఉపాధ్యాయ వృత్తి గొప్పది

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైందని, ప్రతి విద్యార్థి ఉన్నత భవితకు బాటలు వేసేలా పనిచేయాలని అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చలపతిరావు అన్నారు. కళాశాలలో శనివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక దండకారణ్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీనిబాబు హాజరై ప్రసంగించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆయన్ను సత్కరించారు. గిరిజన మిత్ర సభ్యులు భాగ్యవతి, మౌనిక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు

చివరి దశకు గృహ నిర్మాణాల సర్వే

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గతంలో గృహాలు నిర్మించుకుని బిల్లులు చెల్లించని ఇళ్లపై చేపడుతున్న సర్వే చివరిదశకు చేరుకుందని గృహ నిర్మాణసంస్థ మండల ఏఈ సెగ్గె సూరిబాబు తెలిపారు. లకవరపుపేట పంచాయతీలోని తూరుమామిడి, నేరేళ్లబంద గ్రామాల్లో శనివారం సర్వే చేపట్టారు. 2017 నుంచి 2019 వరకు మంజూరైన గృహాలు ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నాయి, బిల్లులు వచ్చాయా లేదా అనే విషయాలను సర్వే చేస్తున్నామని తెలిపారు. మరో మూడు రోజుల్లో సర్వే పూర్తవుతుందని, నివేదికలను ప్రభుత్వానికి పంపుతామన్నారు. కూటమి నాయకులు శెట్టి రామారావు, గబులంగి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


తూరుమామిడిలో సర్వే పరిశీలిస్తున్న గృహనిర్మాణ సంస్థ ఏఈ సూరిబాబు

వైభవంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ



రాజవొమ్మంగి న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో కొత్తగా నిర్మించిన దుర్గాదేవి ఆలయంలో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. విద్యానగర్, రవీంద్ర నగర్‌కు చెందిన వారు అధికంగా పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.

నష్టపరిహారం అందజేయాలి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన తుపాను కారణంగా పంట, ఇళ్లు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.ధర్మన్న పడాల్ కోరారు. వి.కోడాపల్లిలో సీపీఎం మహాసభలు శుక్రవారం నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పంచాయతీలో సమస్యలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించారు. సీపీఎం నాయకులు దీనబంధు, కోటిబాబు, ధర్మారావు, రామన్న, రాంనాయుడు పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

భార్యాభర్తలకు పాముకాటు..

ఆసుపత్రికి తరలిస్తుండగా భార్య మృతి

పాడేరు, న్యూస్‌టుడే: ఇంట్లో నిద్రిస్తున్న దంపతులకు పాము కాటేసింది. ఆసుపత్రికి తరలిస్తుండగా భార్య మృతి చెందింది. పెదబయలు మండలం పర్రెడ పంచాయతీ కుర్తాడి గ్రామానికి చెందిన కుర్తాడి రమేష్, రవణమ్మ(25) దంపతులను శనివారం తెల్లవారుజామున పాము కాటేసింది. భార్య నోటి నుంచి నురగ రావడం, భర్త కాలు వాపులు రావడంతో కుటుంబసభ్యులు గమనించి అంబులెన్సులో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. భర్త రమేష్ ఆరోగ్యం కాస్త కుదుటపడింది. భార్య రవణమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యసేవల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు బంధువులకు సూచించారు. వెంటనే 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో రవణమ్మ మృతి చెందింది. ఈ విషయం తెలిసిన భర్త కన్నీటిపర్యంతమయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.


మృతి చెందిన రవణమ్మ

వీఆర్‌పురంలో రైతు..

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వీఆర్‌పురం బీసీ కాలనీకి చెందిన రైతు కోట్ల లక్ష్మణరావు (58) శనివారం పాము కాటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. పశువులకు మేతకోసం సమీప వరి కుంటల్లోకి పచ్చగడ్డి కోసి మోపుగా కట్టి ఇంటికి తీసుకొచ్చాడు. రాత్రి పశువులకు మేత వేయడానికి కట్టువిప్పి గడ్డిని తీస్తుండగా, అందులో ఉన్న పాము కాటు వేసింది. వెంటనే రేఖపల్లి వైద్యశాలకు తీసుకు వెళ్లి వైద్యం అందిచేలోపు మృతి చెందాడని బంధువులు విలపించారు. లక్ష్మణరావు కుమారుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. తల్లీ ఒక కిడ్నీ ఇచ్చి కొడుకుని బతికించుకుంటుంది. ఇంతలో కొడుకు మళ్లీ క్యాన్సర్ వ్యాధి గురయ్యాడు. అతనికి వైద్యం అందించడానికి ఆపేద కుటుంబం పెద్ద అనేక ఇబ్బందులు పడుతోంది.. ఇలాంటి సమయంలో తండ్రి అకాల మరణం ఆ కుటుంబాన్ని మరింత కష్టాల్లోకి నెట్టింది.

స్వర్ణాంధ్ర-2047కు సలహాలివ్వండి

పాడేరు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర- 2047 ప్రణాళికలు సిద్ధం చేయడానికి సూచనలు, సలహాలు అందించి అందరూ సహకరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కోరారు. శనివారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ రంగాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. వికసిత్ భారత్- 2047 ప్రణాళిక అమలు, లాభాలపై జిల్లా ప్రణాళిక అధికారి ఎస్ఎస్ఆర్కే పట్నాయక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అరకు ఎంపీ తనూజారాణి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. జిల్లాలో సికెల్ సెల్ ఎనీమియా కేసులు ఎక్కువగా ఉన్నాయని, రక్త సేకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణపై గిరిజనులకు అవగాహన కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంత పిల్లలకు నూతన విద్యావిధానం కన్నా పాత విధానమే మేలని అభిప్రాయపడ్డారు. గిరిజన యువత ప్రగతి సంస్థ ప్రతినిధి డాక్టర్ సింహాచలం, వీసీఎఫ్ టాటాట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ అప్పలరాజు, కొయ్యూరు ఎంపీపీ రమేష్ తదితరులు మాట్లాడారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందులో పాల్గొన్నారు. జేసీ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో సంయుక్త కలెక్టర్, సబ్ కలెక్టర్

కొండవాగుకు వరద.. నిలిచిన రాకపోకలు

గంగవరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా గంగవరం శివార్లలో ఏర్పాటుచేసిన డైవర్షన్ రోడ్డుపై కొండవాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో రంపచోడవరం, మారేడుమిల్లి, భద్రాచలం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగి డైవర్షన్ రోడ్డుపైకి నీరు చేరింది. దీంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తహసీల్దార్ చిన్నం శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, ఎస్సై డి.భూషణం ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాగు పరిసరాల్లో పహారా కాసారు. సుమారు కొన్ని గంటలపాటు వాగు ప్రవాహం తగ్గకపోవడంతో రంపచోడవరం, అడ్డతీగల వైపు వెళ్లాల్సిన వాహనదారులు, ప్రయాణికులు ఇరువైపులా అధికసంఖ్యలో నిలిచిపోయారు. వర్షం లేకుండా వాగుప్రవాహం పెరగడంతో ప్రయాణికులు ఆశ్చర్యానికి గురయ్యారు.


గంగవరం శివార్లలో డైవర్షన్ రోడ్డుపై ఉద్ధృతంగా ప్రవహిస్తున్న కొండవాగు

తగ్గుతున్న గోదావరి

దేవీపట్నం, న్యూస్‌టుడే: గోదావరిలో నీటి మట్టం క్రమంగా తగ్గుతోంది. గండిపోశమ్మ ఆలయం వద్ద వరద ప్రవాహం తగ్గడంతో ఆలయ పరిసరాల్లో బురద మట్టి భారీగా పేరుకుపోయింది. ఆలయ మండపంలోని వరద నీరు తగడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వరద తగ్గుతున్న క్రమంలో ఆలయ సమీపంలోని దుకాణాలు కుప్పకూలుతున్నాయని చెబుతున్నారు. పోశమ్మగండి నుంచి డి.రావిలంక వరకు ఆర్అండ్‌బీ రహదారిపై వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. సీతపల్లి వాగులో గోదావరి ఉద్ధృతి తగ్గింది. వరద మరింత తగ్గితే గండిపోశమ్మ అమ్మవారి దర్శనాలు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.


గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఇలా..

108 వాహనంలో గర్భిణి ప్రసవం

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని బాసవాగు సమీపాన శనివారం 108 వాహనంలో గర్భిణి ప్రసవించింది. వివరాల్లోకి వెళితే... వై.రామవరం మండలం డొంకరాయి గ్రామానికి చెందిన గర్భిణి నాగ్ సుగంధి ప్రసవం నిమిత్తం రెండు రోజుల క్రితం చింతూరు ఏరియా ఆసుపత్రిలో చేరింది. ప్రసవం కష్టం కావడంతో వైద్యులు భద్రాచలం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈమెను 108 వాహనంలో భద్రాచలం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఎటపాక మండలం బాసవాగు సమీపాన పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో వాహన ఈఎంటీ ప్రతాప్, ఆశా వర్కర్ సమ్మతి, ఎంపీ ప్రసాద్ సాయంతో వాహనంలోనే ప్రసవం చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ప్రథమ చికిత్స అనంతరం వీరిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.


శిశువుతో సిబ్బంది

తిరువీధుల్లో ఊరేగిన ఉత్సవమూర్తులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న సతీసమేతంగా శనివారం తిరువీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయం నిజరూపానికి అభిషేకం, నిత్యార్చన గావించిన ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు తర్వాత విశేష పూజలు చేశారు. ఆలయంలో బలిహరణ చేపట్టారు. తర్వాత ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంలో అందంగా అలంకరించారు. అనంతరం సన్నాయి, వాయిద్యాల నడుమ తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు హారతులు పట్టి దర్శనం చేసుకున్నారు. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో ఉమ్మడి విశాఖలోని వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనార్థం భక్తులు ఆలయానికి అధికసంఖ్యలో చేరుకున్నారు.


రాజాధిరాజ వాహనంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

పర్యటక కేంద్రాలకు దసరా కళ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: మండలంలోని పర్యటక కేంద్రాలకు దసరా కళ సంతరించుకుంది. చాపరాయి జలవిహారిలో శనివారం పర్యటకులతో సందడి వాతావరణం నెలకొంది. సెలవులు కావడంతో దూరప్రాంతాల నుంచి పర్యటకులు తరలివస్తున్నారు. అంజోడ సిల్క్‌ఫాం వీనరీ, కొల్లాపుట్టు జలతరంగిణిల్లో రద్దీ నెలకొంది.


చాపరాయి జలవిహారిలో పర్యటకులు

అందరి సహకారంతో ఓటరు జాబితాల తయారీ

పాడేరు, న్యూస్‌టుడే: ఓటరు జాబితాలు సిద్ధం చేయడానికి రాజకీయ పార్టీలు సహకారం అందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ కోరారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అరకులోయ నియోజకవర్గంలో 97.68 శాతం, పాడేరులో 96.63 శాతం, రంపచోడవరంలో 98.21 శాతం ఓటరు నమోదు ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నివేదికల మేరకు డూప్లికేట్, మృతి చెందిన ఓటర్ల వివరాలను జాబితా నుంచి తొలగిస్తామన్నారు. ఓటరు రేషనలైజేషన్ ప్రక్రియ పక్కాగా జరుగుతోందని పేర్కొన్నారు. డీఆర్‌ఓ పద్మావతి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి గంగరాజు, వైకాపా నాయకులు రాంబాబు, సీపీఎం నేత వి. హెచ్.దాస్, కాంగ్రెస్ నాయకుడు వి.కృష్ణారావు, తెదేపా నేత వి.జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ నాయకులతో సమావేశమైన జేసీ అభిషేక్ గౌడ, రెవెన్యూ అధికారులు

అయిదేళ్ల ఎదురుచూపులు..

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు!

బిల్లుల్లేక గృహ నిర్మాణ లబ్ధిదారుల ఆవేదన

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమానికి కృషి చేశామంటూ వైకాపా ప్రభుత్వం అయిదేళ్లు గొప్పలు చెప్పుకొంది. క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులున్నాయి. గిరిజనుల సంక్షేమాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. పేదల సొంతింటి కలను నెరవేర్చలేకపోయింది. వైఎస్సార్ గృహ కల్ప పథకంలో కేవలం ఇళ్ల పట్టాలు మంజూరు చేసి చేతులు దులుపుకొంది. ప్రధాన మంత్రి ఆవాస యోజనలో ఇళ్లు నిర్మించుకున్నా.. బిల్లులు చెల్లించడంలో జగన్ సర్కారు నిర్లక్ష్యం చేసింది. అంతకు ముందు తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహాలను పేద గిరిజన కుటుంబాలకు మంజూరు చేశారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటున్న దశలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. బిల్లులొస్తాయని కొండంత ఆశతో లబ్ధిదారులు అప్పటివరకు ఉంటున్న పాకలను తొలగించుకుని అప్పులు చేసి మరీ ఇళ్లు నిర్మించుకున్నారు. బిల్లుల కోసం అయిదేళ్లు ఎదురు చూసినా ఉపయోగం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులు బిల్లుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. డుంబ్రిగుడ మండలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో 664 గృహాలు నిర్మించుకున్నారు. వీటికి ఇంకా బిల్లులు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలని వారంతా కోరుతున్నారు.


శ్లాబు దశకు చేరిన ఎన్టీఆర్ గృహం

అప్పు చేసి పనులు



పాకను తొలగించి ఇంటి నిర్మాణం చేపట్టా. లింటల్ దశ వరకు బిల్లు రూ.45 వేలు ఖాతాలో జమ అయ్యాయి. ఎన్నికలు రావడంతో బిల్లులు నిలిచిపోయాయి. అప్పు చేసి ఇంటిని నిర్మించుకున్నా. అయిదేళ్లుగా సొమ్ముల కోసం ఎదురుచూస్తున్నా. అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నా. కూటమి ప్రభుత్వం మా సమస్య పరిష్కరించాలి.
– గల్లోరి డాలిమ్మ, ఎన్టీఆర్ గృహనిర్మాణ లబ్ధిదారు, సంతవలస

ప్రభుత్వం ఆదుకోవాలి



తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహం మంజూరైంది. ఇంటి నిర్మాణం పూర్తి చేసి అయిదేళ్లు అవుతోంది. బిల్లు కోసం గృహ నిర్మాణశాఖ కార్యాలయం చుట్టూ అయిదేళ్ల కాళ్లరిగేలా తిరిగాం. నయాపైసా బిల్లు రాలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి.
– జన్ని పారమ్మ, లబ్ధిదారు, జంగిడివలస

డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు 7 నుంచి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ ఏడాది ప్రవేశాలకు ఈనెల ఏడో తేదీ నుంచి మూడు రోజులపాటు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. పొలిటికల్ సైన్స్ -17, కంప్యూటర్ అప్లికేషన్స్ (బీకాం) 3 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

పాడేరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-516కు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రంపచోడవరం-కొయ్యూరు- పాడేరు, పాడేరు-అరకు సెక్షన్ల మధ్య 8 ప్రాంతాల్లో సుమారు 6.3 కిలోమీటర్ల మేర రహదారి అటవీ ప్రాంతం గుండా వెళ్తున్నందున.. 18.22 హెక్టార్ల భూమి అవసరమని చెప్పారు. దీనికి తగు చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌ఓలను ఆదేశించారు. నిర్వాసిత సర్వే త్వరితగతిన పూర్తి చేసి నష్ట పరిహారం అందజేయడానికి ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. జేసీ అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమాన్‌పటేల్, అపూర్వ భరత్, కల్పశ్రీ, డీఆర్‌ఓ పద్మావతి, జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్లు గఫూర్, రవిషేక్, ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

కొత్త మద్యం విధానం రద్దు చేయాలి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, ప్రైవేటు వ్యక్తులకు దుకాణాలు అప్పగించరాదని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకులు శనివారం ముంచంగిపుట్టులో నిరసన తెలిపారు. తహసీల్దార్ అప్పలస్వామికి వినతి పత్రం అందించారు. మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తే బెల్టుషాపులు పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రంజిత, లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో వీఆర్‌ఓలు, కార్యదర్శులు విశిష్ట సేవలు అందించారని పెదవలస, దామనాపల్లి, లకవరపుపేట సర్పంచులు కృష్ణవేణి, రామకృష్ణ, వీరేంద్రప్రసాద్ అన్నారు. బదిలీపై వెళుతున్న వీఆర్‌ఓలు గంగా భవాని(పెదవలస), పద్మ(దామనాపల్లి), కార్యదర్శులు బాలకృష్ణ(లకవరపుపేట), కళ్యాణ్ కృష్ణ(దామనాపల్లి)లను గురువారం ఆయా పంచాయతీ కార్యాలయాల్లో సత్కరించారు.

దుప్పిలవాడలో గ్రామసభ

సీలేరు, న్యూస్‌టుడే: దుప్పిలవాడ పంచాయతీ కేంద్రంలో శనివారం ఉదయం సర్పంచి కేలాబు కుమారి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సమస్యలపై చర్చించారు. గత నెల 8న తుపానుకు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా, పెద్దఎత్తున పంటపొలాలు నష్టపోయాయి. నష్టం అంచనా వేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పలువురు గిరిజనులు వాపోయారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రహదారి విస్తరించాలని వినతి

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు నుంచి కాకరపాడు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిని కాకరపాడులోని 516ఇ జాతీయ రహదారి వరకు విస్తరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరినట్లు ఎంపీపీ రమేష్‌బాబు తెలిపారు. శనివారం పాడేరులో జిల్లా కలెక్టర్‌ని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రోడ్డంతా కోతకు గురవడంతో వాహనచోదకులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బూదరాళ్ల సమీపంలోని బొంతువలస ఘాట్‌ని విస్తరించాలని కోరారు. మంప పంచాయతీలోని పైడిపనుకులకు తారురోడ్డు నిర్మించాలన్నారు. రేవళ్లలో ఏర్పాటు చేసిన పాఠశాలను శాశ్వత ప్రాథమిక పాఠశాలగా మార్చాలని విన్నవించారు.

బాల కార్మికులతో పనిచేయిస్తే చర్యలు

చోడవరం పట్టణం: బాల కార్మికులను వ్యాపారులు పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని సహాయ కార్మిక శాఖాధికారి పి.సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఆపరేషన్ స్వేచ్ఛలో భాగంగా దుకాణాల్లో తనిఖీలు చేశారు.

కాలువలోకి దూసుకెళ్లిన లారీ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మైదాన ప్రాంతం నుంచి సిమెంట్ లోడుతో వచ్చిన భారీ వాహనం అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. శనివారం తెల్లవారుజామున చింతపల్లి మసీదు వద్ద ఈ ఘటన జరిగింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. జేసీబీ సహాయంతో లారీని బయటకు తీశారు.



అమ్మా భవానీ.. మనసా స్మరామి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రులలో దుర్గమ్మ శనివారం అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాజవొమ్మంగి, దూసరపాము, వట్టిగెడ్డ, జడ్డంగి, చెరుకుంపాలెం, చికిలింత, అమినాబాద్, బడదనాంపల్లి, శరభవరం, కొండపల్లి, లబ్బర్తి, లాగరాయి, కింద్ర తదితర గ్రామాల్లో దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద అన్న సమారాధన చేశారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: రింతాడలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిగాయి. భవానీ భక్తులు, స్థానిక వ్యాపారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


చింతపల్లి సాయినగర్ వీధిలో దుర్గమ్మ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అరకు పంచాయతీ కేంద్రంలో దుర్గాదేవికి అర్చకులు సూరజ్ త్రివేది ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఉచితంగా ప్రసాదాలు అందజేశారు.

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సాయినగర్ వీధిలో భక్తులు దుర్గాదేవి మండపాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అంతర్లలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నారు. విజ్ఞాన భారతి పాఠశాలలో ఈనెల 9న చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రధానాచార్యులు శ్రీనివాస్ తెలిపారు.

ఎటపాక, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా శనివారం జగన్మాత అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని చోడవరం, ఎటపాక, తోటపల్లి, నెల్లిపాక, గుండాల, నందిగామ గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో కొలువైన అమ్మవారికి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు.

హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేట జీసీసీ డిపో వద్ద నెలకొల్పిన మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొంతిలి గ్రామంలో భవానీ మాలధారులకు పూజల నిమిత్తం మాజీ ఎంపీపీ మావది రూ.50 వేలు అందించారు. శివ, నాయుడు, రామరాజు, మణికంఠ, నానాజీ, గంగరాజు పాల్గొన్నారు.


రింతాడలో..


ఎటపాకలో మహిళల పూజలు


హుకుంపేటలో అన్నదానం

దుకాణాల్లోకి వర్షపు నీరు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: మండలంలోని గిరిజన గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. డుంబ్రిగుడలో దుకాణాల చెంత వరద నీటి ప్రవాహంతో దుకాణదారులు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా మురుగు కాలువలను తొలగించారు. కొండ వాగు ప్రాంతం నుంచి వరద నీరు దుకాణాల్లో చేరుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజేమ, పలిసెలు, మొఖ్తజొన్న పంటలకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉంటుందని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


డుంబ్రిగుడలో వరదనీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న దుకాణదారులు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

కూనవరం, న్యూస్‌టుడే: వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని కూనవరం ఎఫ్‌ఆర్వో ఎం.కరుణాకర్ అన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా కూనవరం అటవీశాఖ కార్యాలయ ఆవరణలో చెత్త తొలగించారు. పైదిగూడెంలో గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఆర్వో కరుణాకర్ మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడుకోవడం ఎంత ముఖ్యమో వన్య ప్రాణులను రక్షించడం అంతే ముఖ్యమన్నారు. ఎవరు ఎంత ప్రలోభపెట్టినా కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేట చేయకూడదన్నారు. ఎఫ్ఎస్‌వోలు అనిల్‌కుమార్, సాయివెంకటరమణ, శంకర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, ఎఫ్‌బీవోలు నాగలక్ష్మి, చంద్రశేఖర్, రామయ్య, వీఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.


పైదిగూడెంలో గ్రామస్థులతో అటవీశాఖ అధికారులు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్‌టీయూ పాడేరు మండల అధ్యక్షురాలిగా ఎన్నికైన తమర్బ నాగ వెంకట హేమలత పేర్కొన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీవీ గిరి, అప్పలరాజుల అధ్యక్షతన శనివారం పాడేరులో సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా రేగం సత్యారావులను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బోధనేతర పని భారం తగ్గించాలన్నారు. జీవో నం 117 రద్దు చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరారు..


పీఆర్‌టీయూ మండల అధ్యక్షురాలిగా ఎన్నికైన నాగ వెంకట హేమలతతో సంఘ నాయకులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన సుండం రామన్న దొర, పాములేటి చిన్నారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహంలో శనివారం సంఘం సమావేశం జరిగింది. సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. రామన్నదొర, చిన్నారెడ్డిలతోపాటు గౌరవాధ్యక్షునిగా రెడ్డి శివకుమార్, సభ్యులుగా దేవరపల్లి తాతాజీ, కె.రాంబాబు, నారాయణ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు ఎంపీడీఓగా శ్రీసాయిహర్ష

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని ఎంపీడీఓ శ్రీసాయిహర్ష అన్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన కిరణ్‌కుమార్ భీమవరానికి బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీఓకు మండల పరిషత్ ఉద్యోగులు స్వాగతం పలికారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీసాయిహర్ష

శాస్త్రవేత్తల పునర్నియామకం

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో ఇద్దరు శాస్త్రవేత్తలను పునర్నియమించారు. సేద్యవిభాగం శాస్త్రవేత్తగా పనిచేస్తున్న సందీప్‌నాయక్, భూసార విభాగం శాస్త్రవేత్త జోగారావు గత ఏడాది పీహెచ్‌డీ చదువుల నిమిత్తం బాపట్ల వ్యవసాయ కళాశాలలో చేరారు. సర్వీసులో ఉండగానే వీరు పీహెచ్‌డీకి వెళ్లడంతో చింతపల్లిలో వీరి స్థానాలు ఖాళీ అయ్యాయి. ఉద్యోగం చేస్తూనే పీహెచ్‌డీకి సంబంధించిన పరిశోధనలు కొనసాగించేలా ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. వారిని పూర్వస్థానాల్లోనే నియమిస్తూ ఆదేశాలు రావడంతో విధుల్లో చేరారు.

సీజీఆర్‌ఎఫ్ సదస్సు 9న

పాడేరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలోని పాడేరు డివిజన్‌లో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 9వ తేదీన సీజీఆర్‌ఎఫ్ సదస్సు నిర్వహించనున్నట్లు పాడేరు ఏఈ ఎ.వి.ఎన్.ఎం అప్పారావు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే సదస్సులో వినియోగదారులు నేరుగా పాల్గొని సరఫరాలో అంతరాయాలు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు.

మన్యంలో మంచు ముసుగు

ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో మన్యంలో ఉదయం పొగమంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వర్షం కురుస్తోంది. శనివారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మ పాదాలు పరిసరాల్లో మంచు దుప్పటి కమ్మేసింది. ఆహ్లాదపర్చే ఈ అందాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.
– పాడేరు పట్టణం, న్యూస్‌టుడే


మోదకొండమ్మ పాదాల వద్ద కమ్మేసిన పొగమంచు

వినతుల స్వీకరణకు ఎమ్మెల్యే రాక!

వై. రామవరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాపన్నదొర తెలిపారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దీనికి హాజరుకానున్నారని, మండల స్థాయి అధికారులంతా అందరూ పూర్తి సమాచారంతో పాల్గొనాలని పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


వృద్ధులతో మాట్లాడుతున్న వైద్యాధికారి మనోజ్ఞ

కొయ్యూరు, న్యూస్‌టుడే: మంప గ్రామంలో నాబార్డు- రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. రాజేంద్రపాలెం వైద్యాధికారి మనోజ్ఞ శిబిరంలో సేవలందించారు. మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి వివరించారు. మాతోట ప్రోగ్రాం మేనేజర్ పి.హరికృష్ణ, సిబ్బంది ఐ.సత్తిబాబు, రవికుమార్, రామారావు పాల్గొన్నారు.

రహదారి లేక ఇబ్బందులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: లంబసింగి పంచాయతీ జలగలగెడ్డ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొర్రా నీలమ్మ పాము కాటుకు గురైందని, విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 2న మరణించిందన్నారు. నీలమ్మ మృతదేహాన్ని స్వగ్రామం జలగలగెడ్డకు తీసుకెళ్లేందుకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నామని చెప్పారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం అడవిలో డోలీమోతతో మృతదేహాన్ని తీసుకెళ్లామన్నారు. సుమారు 40 సంవత్సరాలుగా రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గౌతం నరేంద్ర మహర్షి మిత్ర బృందం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, స్థానిక ఎస్సై అరుణ్‌కిరణ్ అన్నారు. శనివారం చింతపల్లి సచివాలయం వద్ద జరిగిన మనం సేవా సొసైటీ ద్వితీయ వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం మనం సొసైటీ సభ్యులు చింతపల్లి ఏరియా ఆసుపత్రి రోగుల సౌకర్యార్థం బెంచ్‌ను వితరణగా అందించారు. సర్పంచి పుష్పలత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, బేతాలుడు, రమణ పాల్గొన్నారు.

కోయభాషా సాహిత్యాన్ని ప్రోత్సహించాలి

చింతూరు, న్యూస్‌టుడే: కోయభాష సాహిత్యం నేర్చుకునేలా గిరిజన పిల్లలను ప్రోత్సహిస్తే వారంతా బాల కవులుగా మారుతారని కోయబాల సాహిత్య కార్యశాల నిర్వాహకులు పూనెం బాబూరావు సూచించారు. మండలంలోని రామన్నపాలెంలో శనివారం నిర్వహించిన కోయబాల సాహిత్య కార్యశాలలో ఆయన మాట్లాడారు. భాషా బోధకులు ఆ దిశగా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. పిల్లలకు విడిగా, బృందాలుగా వారికి నిర్దేశించిన బోధన అంశాలను వివరించాలన్నారు. అనంతరం అక్కడున్న సమన్వయకర్తలు యాదయ్య, పాండు, భీమమ్మలకు బాబూరావు పలు సూచనలు చేశారు. ప్రతీ గ్రామం నుంచి పిల్లలు ఈ గ్రామానికి వచ్చేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు.


విద్యార్థులతో బోధన బృందం

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

మోతుగూడెం, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగంపాడు వారపు సంతలో శనివారం అల్లూరి ఆదివాసీ యువజన, గిరిజన అభ్యుదయ సంఘాల గిరిజనులు మావోయిస్టులకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం, వారి సిద్ధాంతాలకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీ, మానవహారం ఈ సంఘాలు నిర్వహించాయి. గ్రామంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పలు చోట్ల గోడపత్రికలు వెలిశాయి.


మంగంపాడు వారపు సంతలో..

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570,
అరకులోయ 63034 86346,
రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే:

?: నరసాపురం నుంచి కన్నారం వరకు రోడ్డు పనులు నిలిచిపోయాయి. కంకర పరచి వదిలేశారు.
– కారం బాపిరాజు, కన్నారం గ్రామం

✓: ఈ రహదారి పనులు రెండేళ్ల క్రితం నిలిచిపోయాయి. త్వరలో నిధులు విడుదలవుతాయి. పనులు పూర్తి చేస్తాం.
– సత్యనారాయణ, ఏఈ, గిరిజన సంక్షేమశాఖ, రంపచోడవరం.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లి - చింతూరు ఘాట్ రోడ్డు మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తున్న ఊక లారీల కారణంగా మిగిలిన వాహనదారులకు ఇబ్బందిగా మారింది.
– రమణారెడ్డి, మారేడుమిల్లి

✓: ఇతర వాహనాలతోపాటు, ప్రజలకు ఇబ్బందిగా మారిన ఊక లారీలపై తగిన చర్యలు చేపడతాం.
– వీరకిశోర్, ఎంపీడీవో, మారేడుమిల్లి



ఉద్యోగుల గ్రీవెన్స్ రేపు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ విద్యా విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై ఈనెల 7వ తేదీన ఐటీడీఏ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు నేరుగా హాజరై తమ సమస్యలు తెలియజేయాలని సూచించారు.

నిర్వాసితులకు అండగా కేంద్ర ప్రభుత్వం

కూనవరం, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భాజపా రాష్ట్ర నాయకుడు మధుకర్ స్పష్టం చేశారు. కూనవరంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలనే సంకల్పంతోనే కేంద్రం రూ.12,500 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. దేశాన్ని దోచుకున్న కాంగ్రెస్‌తో సీపీఎం జత కట్టడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నోముల రామారావు, పాయం వెంకయ్య, రాంబాబు, పెరమయ్య, సత్తిబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర నాయకుడు మధుకర్

రోడ్డు పనులకు శంకుస్థాపన

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయలోని పాత పోస్టాఫీస్ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శనివారం శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ నిధులు రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర నిధులు మంజూరు చేశారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, వైకాపా నాయకులు అశోక్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: లంబసింగిలోని ఏపీ టూరిజంకు చెందిన హరితా రిసార్ట్స్‌కు వెళ్లేందుకు రూ. 20 లక్షల పంచాయతీ నిధులతో 450 మీటర్ల మేర సిమెంట్ రహదారి నిర్మిస్తున్నారు. శనివారం లంబసింగి సర్పంచి శాంతికుమారి ఈ పనులకు శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ జేఈ బాలకిషోర్, మాజీ సర్పంచి రఘునాథ్, నూకరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.


కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం